క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవంలో భాగంగా ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 5 వరకు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 264 మంది విద్యార్థులు కంటి పరీక్షలు చేసి, పలువురికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రాథోడ్ కైలాస్, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది సుధీర్‌కుమార్‌కు పురస్కారం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన న్యాయవాది సంగెం సుధీర్ కుమార్ సర్దార్ వల్లభాయ్ స్ఫూర్తి పురస్కారానికి ఎంపికైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సేవ సంస్కృతిక శాఖ, సత్యసంగీత ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ అవార్డును అందజేయనుంది. సెప్టెంబర్ 2న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చేతుల మీదుగా అందుకోనున్నారు.

పుణ్య తిథి వేడుకలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం విఠలేశ్వర ఆలయంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంత్‌సేన మహరాజ్ పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వడ్నాల రవి, రాము, సింగారం లక్ష్మినారాయణ, ప్రసాద్, విఠల్, డేగల రవి, గంగన్న పాల్గొన్నారు.

జీసీసీ చైర్మన్‌ను కలిసిన కాత్లే శ్రీధర్

ఇచ్చోడ: జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతిని శుక్రవారం మండలంలోని దూబార్‌పేట్‌కు చెందిన ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ మార్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఆదివాసీ కళాసంక్షేమ సంఘం ద్వారా కళాకారులు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఆదివాసీ కళాకారులకు అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట ఆనంద్, సోయం విక్రమ్, సోయం నరేశ్ ఉన్నారు

రుణమాఫీ కాని కుటుంబాల సర్వే

తాంసి: రేషన్‌కార్డు లేక రుణమాఫీ కానీ రైతు కుటుంబాల గుర్తింపు కోసం జిల్లా వ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి అన్నారు. శుక్రవారం తాంసిలో కొనసాగుతున్న రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. సర్వేను పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల వారీగా ఇప్పటివరకు రుణమాఫీ పథకం వర్తించని వారి జాబితాను అధికారులకు అందజేసి యాప్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ఆయా గ్రామాల వారీగా రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకునేందుకు ఏవోలను నోడల్ అధికారిగా నియమించి కుటుంబ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు కేటాయించిన నోడల్ అధికారి గ్రామానికి వచ్చినప్పుడు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలు నమోదు చేస్తేనే రుణమాఫీ పొందే అవకాశం ఉందన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఓపీలో రోగుల వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యవేక్షణతో కూడిన అనుబంధ ఆహార అవగాహన కార్యక్రమంలో పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీధర్, శ్రావ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 31న మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఖమర్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పురాతన నాణేల ప్రదర్శన

బోథ్: మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో ఐహెచ్ఆర్‌వో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ శుక్రవారం విద్యార్థులకు పురాతన, విదేశీ నాణేల గురించి వివరించారు. బ్రిటీష్ కాలంలో గల నాణేలు ఏ సంవత్సరంలో ఉపయోగించారో తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిశోర్ కుమార్, సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్, ఉపాధ్యాయులు ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ.3 లక్షల 25వేల 500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దు

ఇచ్చోడ: ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండకుండా స్థానిక పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పంచాయతీ ప్రత్యేక అధికారి లక్ష్మణ్, ఈవో సూర్యప్రకాశ్‌లను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సిరిచెల్మ చౌరస్తా నుంచి శివాజీ చౌక్ వరకు కాలినడకన వెళ్లి రోడ్డు పనులు పరిశీలించారు. జెడ్పీ పాఠశాల వద్ద, సిరిచెల్మ చౌరస్తాలో సిమెంట్ పైపులు వేసి వరద నీటిని తొలగించాలన్నారు. మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, శిరీష్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, సురేందర్‌యాదవ్ ఉన్నారు.

అన్నివర్గాల ప్రజలకు అండగా బీఆర్ఎస్

అన్నివర్గాల ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ జాహెద్ శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరా రు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు. నాయకులు సాబీర్, గణేష్, అడవ్ మారుతి పాల్గొన్నారు.



ఇచ్చోడ: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి

నేరడిగొండ: సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన బంజారా తీజ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థినిలతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



బంజారా విద్యార్థినులతో ఆడిపాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

ఆదిలాబాద్: వినాయక చవితిని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మాండ్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి సెప్టెంబర్ 7 నుంచి మొదలుకొని, సెప్టెంబర్ 17వ తేదీన సామూహిక నిమజ్జనం నిర్వహించేలా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతీ గణేష్ మండప నిర్వాహకులు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

సమావేశంలో భాగంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు, సంఘటన మంత్రి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కోరెడ్డి లెనిన్, కోశాధికారిగా గంధే ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా విశ్వనాథ్, రాజ్ కుమార్, ప్రసాద్, జోగు రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా సాయి, వెంకట్, సాగర్, ప్రచార ప్రముఖ్‌గా నర్సింగ్, సాంస్కృతిక ప్రముఖ్‌గా తిరుమలేష్, న్యాయ సలహాదారులుగా బ్రహ్మం, ఠాకూర్ చందు సింగ్‌లను ఎన్నుకున్నారు.



లెనిన్‌ను సన్మానిస్తున్న సమితి అధ్యక్షుడు

హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బోథ్: హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీసీడీవో ఛాయ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిక్ రూం, ఆరోగ్య రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత టీం జండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

సంఘ భవనాన్ని విభజించి కేటాయించాలి

కైలాస్‌నగర్: ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన యూటీఎఫ్ సంఘ భవనాన్ని అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెండుగా విభజించి కేటాయించాలని టీయూటీఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనాన్ని టీయూటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్ సంఘాలకు చేరో సగం కేటాయించి ఇవ్వాలని కోరారు.

విద్రోహ దినాన్ని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: సెప్టెంబర్ 1న నిర్వహించే విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ అశోక్ కోరారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ సంఘ భవనంలో తెలంగాణ ఉద్యోగ జాయింట్ కమిటీ సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో టీఎన్‌జీఓ కార్యదర్శి నవీన్, లక్ష్మారెడ్డి, శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు లేబర్ కార్డు నమోదు ప్రక్రియ

ఎదులాపురం: జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తనీషా గార్డెన్‌లో సెప్టెంబర్ 1న లేబర్ కార్డు నమోదు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గాజంగుల రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ఆడెపు సుభాష్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో ఆయన సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఫోన్‌ను పోలీసులు కనుగొన్నారు. శుక్రవారం టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు బాధితుడికి ఫోన్ అందజేశారు.

పూలాజీ బాబా శత జయంతి ఉత్సవాలు

తలమడుగు: ఆధ్యాత్మిక ధ్యాన గురువు పరమహంస సద్గురువు పూలాజీ బాబా శత జయంతి ఉత్సవాలను శుక్రవారం మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూలాజీ బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ సునీత వెంకట్ పాల్గొని మాట్లాడారు. పూలాజీ బాబా చూపిన ధ్యాన మార్గంలో నడవాలన్నారు. అనంతరం పిడుగు అభిరామ్‌రెడ్డి ధ్యాన మందిరానికి 50 స్టీల్ ప్లేట్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీలగిరి అశోక్, కార్యదర్శి సునీత రెడ్డి, అభిరామ్ రెడ్డి, ఇందిరమ్మ రాధమ్మ, అనిత, పోచన్న, నవీన్ రెడ్డి, శ్రీకాంత్, గంగన్న, రవికాంత్ పాల్గొన్నారు.



ప్లేట్లు పంపిణీ చేస్తున్న అభిరామ్‌రెడ్డి

బీసీ కులగణన చేపట్టాలి

తలమడుగు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం బీసీల కులగణన చేపట్టిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభలో బీసీ కులగణన జరిపిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి బీసీ కుల గణన చేపట్టి రిజర్వేషన్లు అమలు చేసియాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తోట వెంకటేశ్, రవికాంత్, మేకల వెంకన్న, ఆశన్న యాదవ్, ఆసం రవీందర్, కిషన్, గాజుల సాంబశివ్, వామన్, శ్రీనివాస్, పిడుగు వెంకన్న, రామ్ కిషన్, సురేశ్, లచ్చన్న పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

నార్నూర్: సమయపాలన పాటించని గాదిగూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందురు సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 11 నుంచి వచ్చి, మధ్యాహ్నం మూడు గంటలకే ఇంటికి వెళ్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ప్రతిపనికి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మరప గంగారాం, మెస్రం గోవింద్, కుమ్రవిలాస్, కోరంగ సంబు, మెస్రం సంతోష్, సత్యపాల్, కొడపలింగు, చక్రం నాగరాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

నాణ్యమైన భోజనం అందించాలి

తాంసి: విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ప్రణాళిక అధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకట రమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల ఎంపీడీవో మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. విద్యార్థుల భోజనంతో పాటు పరిసరాల శుభ్రత, స్టాక్ వివరాలు, హాజరుశాతం పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. కేజీబీవీ అధికారి సౌజన్య, పంచాయతీ కార్యదర్శి గంగన్న, శ్రీవిద్య, సంగీత, హేమలత ఉన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

పిల్లల వివరాలు నమోదు చేయాలి

బోథ్: పిల్లలకు వివరాలను ఎప్పటికప్పుడు ఆప్‌లో నమోదు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. శుక్రవారం మండలంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సప్లమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం గురించి వివరించారు. పిల్లల ఖచ్చితమైన బరువును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సౌందర్య, మెడికల్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబిత

అన్నాభావుసాఠేను ఆదర్శంగా తీసుకోవాలి

నార్నూర్: సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్నాభావు సాఠే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అన్నాభావు సాఠేను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న గిజనేతరుల సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని మైనార్టీ నాయకుడు యూనుస్ అక్బాని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, నర్సింగ్ మోరే, పరమేశ్వర్, దుర్గే కాంతారావు, సికేందర్ రాథోడ్, కోరెళ్ల మహేందర్, సునీల్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రతీ బూత్‌లో 200పైగా సభ్యత్వాలు చేయించాలన్నారు. రానున్న రోజుల్లో పాత రికార్డును తిరగరాసే విధంగా కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేయలని సూ చించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆడావ్ చంపత్‌రావ్, మా రుతి దేవ్ పూజే, కనక తుకారం, రాథోడ్ భీంరావ్, ముండే రాజేశ్వర్, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, గేడం మధుకర్, కోవ రాజేశ్వర్ పాల్గొన్నారు.



కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్న నాయకులు

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

తలమడుగు: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదిలాబాద్ సీఐ ఫణిందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే స్థలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ట్రాఫిక్ ఇబ్బది లేకుండా చూసుకోవాలని అన్నారు. అధికారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రైవేట్ స్థలాలలో అయితే ఇంటి యజమాని అనుమతులు రాత పూర్వకంగా తీసుకోవాలన్నారు. గణేశ్ మండపాల వద్ద విద్యుత్ శాఖ అనుమతితోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా కొత్తవారు సంచరించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అంజమ్మ, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఫణిందర్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దు

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత

బేల: గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామ పంచాయతీలోని మొత్తం ఓటర్లతో వార్డుల వారీగా ఓటరు జాబితాపై ఆరా తీశారు. దీంతో పాటు ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లపై పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల జాబితాలోని నూతన ఓటర్లను వారు నివాసం ఉంటున్న ప్రకారం ఓటరు జాబితాలో బీఎల్‌వోలు చేర్చాలని సూచించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట ఎంపీవో వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, కారోబారి కల్యాణ్‌కార్ గజానన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత

సర్వేను పూర్తి చేయాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలో డెంగ్యూ, జ్వరపీడితుల గుర్తింపునకు చేపట్టిన ఇంటింటా సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా రిసోర్సు పర్సన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల్లో నిర్వహిస్తున్న సర్వే తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు కేటాయించిన వార్డుల్లోని ప్రతీ ఇంటిని సందర్శించి జ్వర బాధితులను గుర్తించాలన్నారు. ముఖ్యంగా డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం అమలుపైన సమీక్షించారు. స్త్రీనిధి రుణాలపైన సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో మున్సిపల్, స్త్రీనిధి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

కైలాస్‌నగర్: రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. పూలమొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ బాలురి గోవర్ధన్ రెడ్డి, నాయకులు కొండ గంగాధర్, సంతోష్, రామన్న యాదవ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ కోచింగ్ క్లాసులు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎప్‌సెట్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈఏడాది నుంచి కళాశాలలో ఎప్‌సెట్ తరగతులు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ విఠల్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మణ్, సురేశ్, రాజు, అనిల్, నాందేవ్, ఫరీదా, సమ్రీన్, ఆసియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

పొచ్చెర వాసికి ఆసియన్ ఇంటర్నేషనల్ అవార్డు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన బిట్లింగ్ ముత్తన్నకు ఆసియన్ ఇంటర్నేషనల్ అవార్డు దక్కింది. ఆస్ట్రాలజీలో చేసిన సేవలకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌లో గల హనుమాన్ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు హుండీ పగలగొట్టి అందులోని రూ.4వేల నగదును దొంగలించారని ఆలయ పూజారి గణేష్‌రాజు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ పేర్కొన్నారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

బోథ్: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని బోథ్ సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని మర్లపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు కత్తూరి హన్మండ్లు ఉపాధ్యాయులు లక్ష్మణ్, చంద్రమోహన్, విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని విన్నర్స్ పబ్లికేషన్ ఆథర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంబడి సంతోష్, న్యాయవాదులు మధుకర్, సుధీర్, గంగారెడ్డి, ప్రతాప్ రెడ్డి, అఫ్రోజ్, రాగం ప్రశాంత్ పాల్గొన్నారు.